



Dr.PRK

# పవర్

పోరాడితే పోయెదేమి లేదు బానిస సంకెళ్ళు తప్ప








సంపుటి : 01 సంచిక : 352 | బుధవారం 30 సెప్టెంబర్ 2026 | పేజీలు : 4 | వెల : 4


# నేడు సిరిసిల్లకు రేవంత్

## రూ.345.78 కోట్ల పనులకు సిఎం శ్రీకారం.. బహిరంగ సభపై సర్వత్రా నెలకొన్న ఆసక్తి




**హైదరాబాద్, పవర్ న్యూస్**

తెలంగాణ రాజకీయాల్లో సిరిసిల్ల ఇప్పుడు మరోసారి హాట్‌టాపిక్‌గ్గ మారింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేడు సిరిసిల్ల నియోజకవర్గంలో పర్యటించనున్నారు. సీఎం హోదాలో ఆయన తొలిసారి సిరిసిల్లకు రావడం ఒకవైపు అయితే.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో భారీ బహిరంగ సభ నిర్వహించనుండటం మరోవైపు రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ పర్యటనలో రేవంత్‌రెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. సిరిసిల్ల, వేములవాడ ప్రాంతాల్లో విద్య, ఆలయ అభివృద్ధి, పరిపాలనా మౌలిక వసతులు, మహిళా సాధికారత, నేతన్నల సంక్షేమానికి సంబంధించిన కార్యక్రమాలు ఉన్నాయి. సిరిసిల్లకు రూ.200 కోట్ల అంచనా వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరైనట్లు ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది.సీఎం రేవంత్ రెడ్డి పర్యటనలో భాగంగా సుమారు రూ.345.78 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. వేములవాడలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు సీఎం రేవంత్ శంకుస్థాపన చేయనున్నారు. పెద్దూరులో సుమారు 18 ఎకరాల్లో నిర్మించనున్న ఈ విద్యా సముదాయంలో 5వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు వసతి, తరగతి గదులు, డార్మిటరీలు, డైనింగ్, క్రీడా సదుపాయాలు కల్పించేలా ప్రణాళిక రూపొందించారు. సిరిసిల్ల, కోనరావుపేటలో తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటుకు కూడా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రీ ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు ఆధునిక తరగతి గదులు, ల్యాబ్‌లు, డైనింగ్ హాళ్లు, క్రీడా సదుపాయాలు, ఐటీ మౌలిక వసతులు కల్పించనున్నారు.

# ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేపై కుల వివక్ష దారుణం

### ఢిల్లీ వేదికగా గర్జించిన డా. పెరుమాండ్ల రామకృష్ణ

### కుల వివక్ష అణచివేత ధోరణులపై ఆత్మగౌరవ పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరిక

**(న్యూ ఢిల్లీ-- పవర్, సెప్టెంబర్ 29)**




అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ూ×జజ) అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేపై జరిగిన కుల వివక్ష, అణచివేత ధోరణులకు వ్యతిరేకంగా, సమాజంలో ఆత్మగౌరవాన్ని చాటేందుకు ఢిల్లీ వేదికగా ఈరోజు కాంగ్రెస్ ఎంపీల ఫోరమ్ కన్వీనర్ మల్లు రవి గారి ఆధ్వర్యంలో ముఖ్య అతిథులుగా డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క గారు ఏఐసీసీ ముకుల్ వాస్నిక్ గారు మంత్రి మునియప్ప మంత్రి వివేక్ గారు మంత్రి సీతక్క గారు ఏఐసీసీ కొప్పుల రాజు గారు ఏఐసీసీ ఎస్సి చైర్మన్ రాజేంద్రపాల్ గారు ఎస్టీ చైర్మన్ బిరియా గారు భారీ ఆత్మగౌరవ సభ (సెల్ఫ్ రెస్పెక్ట్ మీటింగ్) నిర్వహించారు. ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేపై జరిగిన కుల వివక్ష ఘటనను డా. పెరుమాండ్ల రామకృష్ణ ఢిల్లీ వేదికగా తీవ్రంగా ఖండించారు. ఆయన మాట్లాడుతూ, దళిత నేత అయిన ఖర్గేజీపై వివక్షాపూరిత చర్యలకు పాల్పడటం అత్యంత హేయమైన చర్య అని మండిపడ్డారు. సమాజంలో ఇటువంటి అమానుష ధోరణులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని, బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకునే వరకు, వారి సభ్యత్వాలను రద్దు చేసే వరకు ఈ కుల వివక్ష వ్యతిరేక ఆత్మగౌరవ పోరాటాన్ని జాతీయ స్థాయిలో మరింత ఉధృతం చేస్తామని గట్టిగా హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అణగారిన వర్గాల ఆత్మగౌరవ రక్షణకు అండగా ఉంటుందని స్పష్టం చేశారు.అనంతరం డా. రామకృష్ణ జాతీయ స్థాయి రాజకీయ పరిణామాలు, ఉత్తరాఖండ్ రాష్ట్రంలో దళితుల పక్షాన అనుసరించాల్సిన వ్యూహాలు మరియు భవిష్యత్ కార్యాచరణపై తన అభిప్రాయాలను వెల్లడించారు. సీనియర్ నాయకుడిగా డా. పెరుమాండ్ల రామకృష్ణ సేవలను కాంగ్రెస్ జాతీయ నాయకత్వం ఏఐసీసీ జనరల్ సెక్రటరీ ముకుల్ వాస్నిక్ గారు ఈ సమావేశంలో ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఎంపీలు మరియు యాదాద్రి బోర్డు మెంబెర్ డా లక్ష్మీనారాయణ నాయక్ సుధాకర్ గౌడ్ సూర్యకిరణ్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు .

# ఢిల్లీలో ఘనంగా దళిత, ఆదివాసీ ఆత్మగౌరవ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, ఎంపీలతో కలిసి పాల్గొన్న డా. పెరుమాండ్ల రామకృష్ణ

**(న్యూఢిల్లీ – పవర్ దినపత్రిక, సెప్టెంబర్ 29)**

ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో కాంగ్రెస్ ఎంపీల ఫోరమ్ కన్వీనర్ మల్లు రవి ఆధ్వర్యంలో దళిత, ఆదివాసీ ఆత్మగౌరవ సభ (సెల్ఫ్ రెస్పెక్ట్ మీటింగ్) అత్యంత వైభవంగా నిర్వహించారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ూ×జజ) అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేపై జరిగిన కుల వివక్ష, అణచివేత ధోరణులను నిరసిస్తూ చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రముఖులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ముకుల్ వాస్నిక్, కేంద్ర మాజీ మంత్రి కేహెచ్ మునియప్ప, మంత్రులు గడ్డం వివేక్, అనసూయ (సీతక్క), ఏఐసీసీ ఎస్సీ విభాగం అధ్యక్షులు కొప్పుల రాజు, రాజేంద్రపాల్ గౌతమ్, ఎస్టీ చైర్మన్ తదితరులు హాజరయ్యారు. ఈ ప్రతిష్టాత్మక వేదికపై... డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, ఎంపీలు మరియు ఇతర ప్రముఖ నాయకులందరితో కలిసి సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ ఈ కార్యక్రమంలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. సమావేశంలో భాగంగా జాతీయ రాజకీయాలు, అణగారిన వర్గాల హక్కులు, భవిష్యత్ కార్యాచరణపై అగ్రనేతలతో కలిసి ఆయన చర్చల్లో భాగస్వామ్యమయ్యారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు మరియు యాదాద్రి బోర్డు మెంబర్ డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్, సుధాకర్ గౌడ్, సూర్యకిరణ్, రాజేందర్ తదితరులు కూడా పాల్గొన్నారు.






## దురుసుగా ప్రవర్తించిన

# పోలీసులను గుర్తించండి

### అసెంబ్లీ వద్ద ఘటనపై డీజీపీకి హైకోర్టు ఆదేశం

**హైదరాబాద్, పవర్ న్యూస్**

తెలంగాణ అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల దురుసుగా ప్రవర్తించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికారులను గుర్తించాలని రాష్ట్ర డీజీపీని హైకోర్టు ఆదేశించింది. మంగళవారం ఈ మేరకు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆ అధికారుల వివరాలను సేకరించి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు సమర్పించాలని డీజీపీ సీవీ ఆనంద్‌కు సూచించింది. సెప్టెంబర్ 7న అసెంబ్లీ వర్షాకాల సమావేశాల మొదటి రోజున ఈ ఘటన చోటుచేసుకుంది. నల్ల టీ-షర్టులు ధరించి నిరసన తెలిపేందుకు వెళుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీ గేటు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, ఎమ్మెల్యేలకు మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగింది. ఈ ఘటనలో తమ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు అమర్యాదగా ప్రవర్తించారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం, బాధ్యులైన అధికారులపై అసెంబ్లీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు ఉంటుందని స్పష్టం చేసింది. ఒక మహిళా ఎమ్మెల్యే చీర లాగారని, మాజీ హోంమంత్రిగా పనిచేసిన మరో మహిళా ఎమ్మెల్యేను మెడ పట్టుకుని నెట్టారని బీఆర్ఎస్ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు: అభ్యర్థులను ప్రకటించిన తెలంగాణ కాంగ్రెస్

### సామ రామ్మోహన్ రెడ్డి, రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి పేర్లు ఖరారు

### ఇప్పటికే ప్రారంభమైన ఓటర్ల నమోదు ప్రక్రియ

### అర్హులైన పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలన్న కేటీఆర్

**హైదరాబాద్, పవర్ న్యూస్**

తెలంగాణలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థులను ప్రకటించింది. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ నియోజకవర్గానికి సామ రామ్మోహన్ రెడ్డిని, వరంగల్-ఖమ్మం-నల్గొండ స్థానానికి రాంరెడ్డి సర్వోత్తం రెడ్డిని బరిలోకి దింపుతున్నట్టు మంగళవారం రాత్రి వెల్లడించింది.కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈ పేర్లను



ఆమోదించారని, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారని పార్టీ వర్గాలు తెలిపాయి. 2027 మార్చిలో ఖాళీ అవుతున్న ఈ రెండు స్థానాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది.ఈ ఎన్నికల కోసం ఓటర్ల నమోదు ప్రక్రియ సోమవారం నుంచే ప్రారంభమైన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. అర్హులైన పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) సుదర్శన్ రెడ్డి కోరారు. నవంబర్ 1, 2026 నాటికి డిగ్రీ లేదా తత్సమాన డిప్లొమా పూర్తి చేసి కనీసం మూడేళ్లు దాటిన వారు ఓటు హక్కు నమోదుకు అర్హులు. గతంలో ఓటు హక్కు ఉన్నవారు కూడా మళ్లీ కొత్తగా నమోదు చేసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

# షాదీఖానా స్థల కేటాయింపు పత్రం అందజేసిన ఎమ్మెల్యే నాయిని..

**- రాజకీయాలకు అతీతంగా మైనార్టీల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది**
**- గత పాలకులు మైనార్టీలను కేవలం ఓట్ల కోసమే ఉపయోగించుకున్నారు..**
**- అందరి ఆమోదంతో అనువైన స్థలాన్నే కేటాయిస్తున్నాం: ఎమ్మెల్యే నాయిని...**



**(హనుమకొండ -- పవర్, సెప్టెంబర్ 29)**

వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని ముస్లిం మైనార్టీలకు షాదీఖానా నిర్మాణం కోసం అనువైన స్థలాన్ని కేటాయిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలో భాగంగా 0.25 గుంటల స్థల కేటాయింపు పత్రాన్ని మత పెద్దలకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి గారు అందజేశారు. మంగళవారం మైనార్టీ మత పెద్దలు, స్థానిక ప్రముఖుల సమక్షంలో కేటాయించిన స్థలాన్ని ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో షాదీఖానా నిర్మాణం కోసం ఒక స్థలాన్ని కేటాయించినప్పటికీ, ఆ స్థల పరిస్థితులు, భవిష్యత్తులో నిర్మాణానికి ఎదురయ్యే ఇబ్బందులను అధికారులు పరిశీలించారని తెలిపారు. గతంలో ఆ ప్రాంతంలో భద్రకాళి అమ్మవారి మట్టి తీసుకువచ్చి స్థలాన్ని పూడ్చడం జరిగిందని, అక్కడ నిర్మాణం చేపడితే భవనం పునాదులు కుంగిపోయే అవకాశం ఉందన్న సాంకేతిక అంశాలను అధికారులు గుర్తించారని వివరించారు. మైనార్టీలకు మంచి వసతులతో షాదీఖానా నిర్మించాలన్న ఉద్దేశంతోనే పాత స్థలానికి ప్రత్యామ్నాయంగా మరింత అనువైన స్థలాన్ని ఎంపిక చేయాలని నిర్ణయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అయితే ఈ నిర్ణయాన్ని కొందరు రాజకీయంగా విమర్శిస్తూ, గతంలో కేటాయించిన స్థలాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందంటూ తప్పుడు ప్రచారం చేశారని అన్నారు. వాస్తవ పరిస్థితులను ప్రజలకు వివరించకుండా రాజకీయ లబ్ధి కోసం మైనార్టీలను తప్పుదోవ పట్టించడం సరికాదని పేర్కొన్నారు.

ఇప్పటికే మత పెద్దలు, స్థానిక పెద్దలతో కలిసి స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించామని, రహదారి సౌకర్యం, స్థల పరిస్థితులు, భవిష్యత్ నిర్మాణానికి అనుకూలత వంటి అంశాలను వారికి స్వయంగా వివరించామని చెప్పారు. అందరికీ ఆమోదయోగ్యంగా, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఉండే స్థలాన్ని ఎంపిక చేసుకునే అవకాశాన్ని మత పెద్దలకే కల్పించామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. మైనార్టీల సంక్షేమం విషయంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా పనిచేస్తోందని నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. షాదీఖానా నిర్మాణంతో ముస్లిం మైనార్టీ కుటుంబాలకు వివాహాలు, ఇతర సామాజిక కార్యక్రమాలు నిర్వహించేందుకు తగిన సౌకర్యం కలుగుతుందని తెలిపారు. అవసరమైన తదుపరి చర్యలను అధికారులతో సమన్వయం చేసుకుని వేగంగా పూర్తి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో కాజీపేట దర్గా పీఠాధిపతి కుసురు పాషా, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, జిల్లా కాంగ్రెస్ మైనారిటీ చైర్మన్ అజిత్ ఉల్లా, మాజీ కార్పొరేటర్లు అబూబకర్, నసీం జాన్, విజయశ్రీ రాజాలీ, నాయకులు అంకుస్, బాబాయ్, ముజాహిద్, సమీ, మైనార్టీ మత పెద్దలు, స్థానిక నాయకులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలి

**- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి**
**-పాడి గేదెల పెంపకంతో ప్రతి నెలా నమ్మకమైన ఆదాయం**
**-శ్వేత విప్లవంతో గ్రామీణ కుటుంబాల ఆర్థిక బలోపేతం**
**-ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన పాడి గేదెలను పరిశీలించిన పరకాల ఎమ్మెల్యే**



**(ఆత్మకూరు -- పవర్ దినపత్రిక, సెప్టెంబర్ 29)**

పాడి గేదెల పెంపకాన్ని ప్రోత్సహిస్తూ గ్రామీణ కుటుంబాల ఆదాయం పెంచడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందడుగు వేస్తోందని పరకాల నియోజకవర్గ శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి స్పష్టం చేశారు. ఆత్మకూరు మండలం అక్కంపేట, కామారం, పెంచికలపేట, నీరుకుల్లా గ్రామాలలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన పాడి గేదెలను లబ్ధిదారుల ఇళ్లకు నేరుగా వెళ్లి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు. పాడి పరిశ్రమను ప్రోత్సహించడం ద్వారా గ్రామీణ కుటుంబాలకు స్థిరమైన ఆదాయం లభించి, వారు ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు.

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ప్రతి కుటుంబం ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో శ్వేత విప్లవం తీసుకురావడంలో భాగంగా దామెరలో మహిళలతో పరకాల ఇందిరా మహిళా డైరీని ఏర్పాటు చేస్తున్నామని ఆయన వెల్లడించారు. రాబోయే రెండు సంవత్సరాలలో సుమారు 40 వేల కుటుంబాలను ఈ డైరీలో చేర్చుతామని స్పష్టం చేశారు.

ప్రభుత్వం మంజూరు చేసిన పాడి గేదెలను సక్రమంగా సంరక్షిస్తూ, పాడి ఉత్పత్తిని పెంచుకొని అదనపు ఆదాయం పొందాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి లబ్ధిదారులకు సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం, ఉపాధి అవకాశాలను గ్రామీణ కుటుంబాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ పర్యటనలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, అధికారులు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## శ్రీనివాస పినాకిల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న దేవన్నపేట మాజీ సర్పంచ్ చుంచు రవీందర్‌ను పరామర్శించిన వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్

**(హన్మకొండ -- పవర్, సెప్టెంబర్ 29, 2026)**

వర్ధన్నపేట నియోజకవర్గ గ్రేటర్ వరంగల్ 65వ డివిజన్ పరిధిలోని దేవన్నపేట గ్రామ మాజీ సర్పంచ్ చుంచు రవీందర్ అనారోగ్య సమస్యతో శ్రీనివాస పినాకిల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొని, వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్ హాస్పిటల్‌కు వెళ్లి ఆయనను పరామర్శించారు.

ఈ సందర్భంగా రవీందర్ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయనకు మెరుగైన వైద్యం అందించాలని సూచిస్తూ, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు ఉన్నారు.



## భూముల రీసర్వేతో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది

**పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి**



**(ఆత్మకూరు -- పవర్, సెప్టెంబర్ 29)**

ఆత్మకూరు మండలం అగ్రంపహాడ్ గ్రామంలో నిర్వహిస్తున్న భూ రీసర్వే కార్యక్రమాన్ని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా రీసర్వే ప్రక్రియ కొనసాగుతున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు సంబంధించిన భూముల వివరాలను పారదర్శకంగా, క్షేత్రస్థాయిలో పక్కాగా పరిశీలించి నమోదు చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీసర్వే ప్రక్రియపై రైతులకు ఎప్పటికప్పుడు సమగ్ర సమాచారాన్ని అందించాలని అధికారులను ఆదేశించారు. రీసర్వే విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు, సందేహాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులకు ఏవైనా సందేహాలు లేదా అభ్యంతరాలు ఉంటే వాటిని క్షేత్రస్థాయిలోనే పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. రీసర్వే ప్రక్రియలో అధికారులు రైతులకు అందుబాటులో ఉండి, వారికి అవసరమైన సహకారం అందించాలని అన్నారు.

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక వర్క్‌షాప్



**(హైదరాబాద్ -- పవర్, సెప్టెంబర్ 29)**

తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు అధ్యక్షతన హైదరాబాద్‌లో నిర్వహించిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక వర్క్‌షాప్ కార్యక్రమంలో బీజేపీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇంచార్జీ డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి పాల్గొన్నారు. రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా అనుసరించాల్సిన ఎన్నికల వ్యూహాలు, కార్యాచరణ ప్రణాళిక మరియు క్షేత్రస్థాయి సమన్వయంపై ఈ సమావేశంలో కూలంకషంగా చర్చించారు. పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయఢంకా మోగించాలని నాయకులు దిశానిర్దేశం చేశారు.

## పెద్దాపూర్ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలి

**కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేసిన వార్డు సభ్యులు**
**మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితో కలిసి వినతి**



**(హనుమకొండ - పవర్,సెప్టెంబర్ 29):**

ఆత్మకూర్ మండలం పెద్దాపూర్ గ్రామపంచాయతీలో 15వ సెంట్రల్ ఫైనాన్స్ నిధుల వినియోగంపై సమగ్ర విచారణ జరిపి, అవకతవకలు జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వార్డు సభ్యులు కోరారు. ఈ మేరకు పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. గ్రామంలోని 2, 5, 6, 7, 12వ వార్డులకు చెందిన సభ్యులు మాట్లాడుతూ.. పంచాయతీ నిధుల దుర్వినియోగంపై గతంలో జూన్ 29న ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. డివిజనల్ పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు జూలై 15న గ్రామపంచాయతీ కార్యాలయంలో జరిగిన విచారణకు హాజరై తమ వద్ద ఉన్న ఆధారాలను సమర్పించినట్లు పేర్కొన్నారు. అయితే విచారణ పూర్తయినప్పటికీ ఇప్పటివరకు తదుపరి చర్యలు తీసుకోలేదని తెలిపారు. ఫిర్యాదు చేసిన నేపథ్యంలో తమ వార్డుల్లో పారిశుధ్య కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించడం లేదని, వీధి దీపాల సమస్యలను పరిష్కరించాలని కోరినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అలాగే పంచాయతీ నిధులకు సంబంధించిన కొన్ని తీర్మానాలపై సంతకాలు చేయాలని తమపై ఒత్తిడి చేస్తున్నారని వార్డు సభ్యులు పేర్కొన్నారు. పంచాయతీ నిధుల వినియోగంపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలని వారు కలెక్టర్‌ను కోరారు.

# వరంగల్ తూర్పులో అభివృద్ధి శూన్యం

**- బీజేపీ నేత ఎర్రబెల్లి ప్రదీప్‌రావు**
**- ఎమ్మెల్యే కనబడటం లేదంటూ బీజేపీ వినూత్న నిరసన**
**- బూడిద గుమ్మడికాయలు కొట్టి కలెక్టరేట్‌ను ప్రారంభించిన బీజేపీ నేతలు**



**(వరంగల్ - పవర్, సెప్టెంబర్ 29):** వరంగల్ తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యంగా ఉందని బీజేపీ నేత ఎర్రబెల్లి ప్రదీప్‌రావు విమర్శించారు. ఎమ్మెల్యే, మంత్రి కొండా సురేఖ కనబడటం లేదంటూ సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో వినూత్న నిరసన చేపట్టారు. ఓసిటీలోని ప్రదీప్‌రావు నివాసం నుంచి నూతన వరంగల్ జిల్లా సమీకృత కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి, అక్కడ బూడిద గుమ్మడికాయలు కొట్టారు. అనంతరం బీజేపీ శ్రేణులే కలెక్టరేట్‌ను అధికారికంగా ప్రారంభించినట్లు ప్రకటించారు. వరంగల్ జిల్లా సమీకృత కలెక్టరేట్ వద్ద కాకతీయుల కీర్తి తోరణం ఏర్పాటు చేయకపోవడం బాధాకరమని ప్రదీప్‌రావు అన్నారు. ఇది చరిత్రను, కాకతీయుల కీర్తిని అవమానించడమేనని పేర్కొన్నారు. వరంగల్ జిల్లా ఏర్పాటైనా ప్రభుత్వ కార్యాలయాలు హనుమకొండలోనే కొనసాగుతున్నాయని, చివరకు వరంగల్ తూర్పు ఎమ్మెల్యే, మంత్రి కొండా సురేఖ నివాసం కూడా హనుమకొండలోనే ఉందని అన్నారు. తూర్పు నియోజకవర్గంలో చిన్నపాటి వర్షానికే ముంపు సమస్య ఏర్పడుతోందని, ఎంజీఎం ఆసుపత్రి శిథిలావస్థకు చేరినా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ప్రారంభించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యమని విమర్శించారు. వరంగల్ కలెక్టరేట్, నూతన ఆసుపత్రిని వెంటనే ప్రారంభించి, పెండింగ్‌లో ఉన్న బస్‌స్టాండ్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంటా రవి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తప్పుడు ప్రచారం చేస్తే మహిళలే కొడతరు

**- వరంగల్ అభివృద్ధి పనులను త్వరలో పూర్తి చేస్తాం**
**- వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ వ్యాఖ్యలు**
**- 111 మందికి రూ.61.61 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**



**(వరంగల్ - పవర్, సెప్టెంబర్ 29 ) :** తన కుటుంబంపై తప్పుడు ప్రచారాలు చేస్తే తన దగ్గర ఉన్న మహిళలే ఉరికిచ్చి కొడతారని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ అన్నారు. వరంగల్ తూర్పు క్యాంపు కార్యాలయంలో మంగళవారం 111 మంది లబ్ధిదారులకు రూ.61,61,200 సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల వచ్చిన నాయకులు గాల్లో కత్తులు తిప్పుతున్నారని వ్యాఖ్యానించారు. ఎంజీఎంలో బీఆర్ఎస్ నేతలు కావాలనే తొక్కిసలాట చేసి రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. మంత్రి పదవి పోయినా బాధ లేదని, అధికారులతో సత్సంబంధాలు ఉన్నాయని తెలిపారు. త్వరలోనే 8 అంతస్తుల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, నూతన కలెక్టరేట్ ప్రారంభిస్తామని, కాంట్రాక్టర్ డబ్బుల కోసం పనుల్లో నిర్లక్ష్యం చేస్తున్నారని పేర్కొన్నారు. వరంగల్ దేవాలయాల అభివృద్ధికి బీజేపీ నేతలు కేంద్రం నుంచి నిధులు తేవాలని, ఫోర్ట్‌లో బయటపడిన 11 దేవాలయాలను కేంద్ర సహకారంతో అభివృద్ధి చేయాలని అన్నారు. తూర్పు నియోజకవర్గంలోని 99 శాతం దేవాలయాలకు తమే నిధులు ఇచ్చామని చెప్పారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో 24 కార్పొరేటర్ స్థానాలు గెలవడమే లక్ష్యమన్నారు. వారంలో ఒకరోజు 'డివిజన్ బాట' నిర్వహించి సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సర్వే జరుగుతోందని, అర్హులైన పేదలు, జర్నలిస్టులకు ఇళ్లు కేటాయిస్తామని వెల్లడించారు

## జయశ్రీకి న్యాయం జరిగే వరకు పోరాటం ఆపేది లేదు: ప్రజా సంఘాల నేతలు



**(హనుమకొండ -- పవర్, సెప్టెంబర్ 29, 2026)** అత్త మీరాబాయి వలన అక్రమంగా గృహ నిర్బంధంలో ఉన్న హనుమకొండ నగరంలోని 52వ డివిజన్ రాంనగర్ చెందిన గూడూరు జయశ్రీ మరియు ఆమె కూతురు తేజస్వినికి విముక్తి కల్పించి, న్యాయం జరిగే వరకు పోరాటం ఆపేది లేదని ప్రజా సంఘాల నేతలు సింగారపు అరుణ, దొమ్మటి ప్రవీణ్, కోకటి సుమ స్పష్టం చేశారు. మంగళవారం హనుమకొండలోని రాంనగర్‌లో జయశ్రీ నిర్బంధంలో ఉన్న ఇంటి ముందు ఆమె కుమారుడు కార్తికేయ చేస్తున్న నిరసనకు వారు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జయశ్రీని ఆమె అత్త మీరాబాయి అక్రమంగా ఇంట్లో నిర్బంధించడాన్ని తీవ్రంగా ఖండించారు. నిర్బంధంలో ఉన్న జయశ్రీకి వెంటనే విముక్తి కల్పించి, గతంలో జయశ్రీ పేరు మీద రాసిచ్చిన ఇల్లు మరియు ఇతర ఆస్తులను వెంటనే ఇప్పించాలని, ఇందుకు సీపీ, కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే వెంటనే దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. బాధితురాలిని వేధిస్తున్న గూడూరు జయశ్రీ అత్త మీరాబాయిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. జయశ్రీకి న్యాయం జరిగే వరకు ప్రజా సంఘాలు, మహిళా సంఘాల ఆధ్వర్యంలో పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు, సామాజిక కార్యకర్తలు గట్టికొప్పుల రాములు, గట్టికొప్పుల పద్మ, కేదల ప్రసాద్, చాపర్తి కుమార్, గాద్దే, తాటికొండ సద్గుణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణే లక్ష్యం

**వర్ధన్నపేట,రాయపర్తిలో రోడ్డు ప్రమాద స్థలాల పరిశీలన**
**వరంగల్ పోలీస్ కమిషనర్ ఎస్.శ్వేత**



**(రాయపర్తి/వర్ధన్నపేట- పవర్, సెప్టెంబర్ 29) :** రహదారులపై వరుస ప్రమాదాలకు అడ్డుకట్ట వేసి ప్రయాణికుల ప్రాణాలకు రక్షణ కల్పించడమే ప్రధాన లక్ష్యమని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎస్.శ్వేత అన్నారు.మంగళవారం వరంగల్ -ఖమ్మం జాతీయ రహదారిపై వర్ధన్నపేట,రాయపర్తి మండలాల పరిధిలో జరుగుతున్న ప్రమాద స్థలాలను(బ్లాక్ స్పాట్స్) రోడ్డు రవాణా,నేషనల్ హైవేస్ అథారిటీ(ఎన్ హెచ్ఎఐ) అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు.ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్న ప్రదేశాల్లో అవసరమైన చోట రోడ్డు వెడల్పు,కల్వర్టుల వద్ద రక్షణ గోడలు నిర్మించాలని సంబంధిత అధికారులకు సూచించారు.రాత్రి వేళల్లో సైతం మలుపులు స్పష్టంగా కనిపించేలా రేడియం సూచిక బోర్డులు,బ్లింకర్ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. మితిమీరిన వేగం,రాంగ్ రూటు డ్రైవింగ్,మద్యం సేవించిన వాహనాలు నడిపే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని పోలీసులను ఆదేశించారు.కేవలం జరిమానాలు విధించడమే కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించడంపై దృష్టి సారించాలన్నారు.అనంతరం రాయపర్తి పోలీస్ స్టేషన్ ఆవరణంలో పోలీస్ అధికారులు,సిబ్బందితో కలిసి ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.శాంతి భద్రతల పరిరక్షణ,కేసుల పురోగతిపై పలు సూచనలు చేసారు.ఈ కార్యక్రమంలో వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్, వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య,సీఐ వై.సంజీవరావు, ఎస్సైలు ముత్యం రాజేందర్,సాయి బాబ, వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నుంచి ఐదుగురి బహిష్కరణ

**లక్ష్మణ్ నాయక్‌పై దాడి ఘటనలో క్రమశిక్షణ చర్యలు**
**హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల ఉత్తర్వులు**



Mobile : +91 8978103333
wedsite: inchnk.com
email: hello@inchnk.com
dcchanumakonda@gmail.com

HANUMAKONDA DISTRICT CONGRESS COMMITTEE
N.R.R. BHAVAN, HANUMAKONDA, TELANGANA - 506 001

ENGALA VENKATRAM REDDY
President

ప్రెస్ నోట్

డిసిసి ఆఫీస్, హనుమకొండ - 29.09.2026

టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ గారి ఆదేశాల ప్రకారం వేలేర్ ఘటనపై కఠిన చర్యలు : పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించిన ఐదుగురు సభ్యులు తక్షణమే బహిష్కరణ.

1. మహమ్మద్ సద్దాం హుస్సేన్ (డీసీసీ కార్యవర్గ సభ్యులు)
2. బైరి అనిల్ (మాజీ వార్డు మెంబర్)
3. అందె కృపా సాగర్ (14వ వార్డు మెంబర్)
4. కుర్సపెల్లి హరీష్ (పార్టీ కార్యకర్త)
5. మహమ్మద్ సలీం మాలిక్ (మాజీ సోషల్ మీడియా మండల ఇన్‌ఛార్జ్)

ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ..

ఇనగాల వెంకట్రామ్ రెడ్డి
అధ్యక్షులు, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ

**( హనుమకొండ - పవర్, సెప్టెంబర్ 29 ) :** వేలేర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మురావత్ లక్ష్మణ్ నాయక్‌పై జరిగిన దాడి ఘటనలో పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించిన 5 మందిని కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరించినట్లు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. లక్ష్మణ్ నాయక్‌పై జరిగిన దాడికి సంబంధించి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ నెల 25న తాను లేఖ సమర్పించగా, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలతో టీపీసీసీకి నివేదిక పంపినట్లు తెలిపారు. నివేదిక ఆధారంగా డీసీసీ కార్యవర్గ సభ్యుడు మహమ్మద్ సద్దాం హుస్సేన్, మాజీ వార్డు మెంబర్ బైరి అనిల్, 14వ వార్డు మెంబర్ అందె కృపాసాగర్, పార్టీ కార్యకర్త కుర్సపెల్లి హరీష్, మాజీ సోషల్ మీడియా మండల ఇన్‌చార్జ్ మహమ్మద్ సలీం మాలిక్‌లను పార్టీ నుంచి పూర్తిగా బహిష్కరించినట్లు ఇనగాల వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు కష్టపడే ప్రతి కార్యకర్త, నాయకుడికి పార్టీ నాయకత్వం అండగా ఉంటుందని ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అన్నారు. పార్టీలో క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యత ఉందని, క్రమశిక్షణను ఉల్లంఘించి అరాచకాలకు పాల్పడితే ఎంతటి వారిపైనైనా పార్టీ అధిష్ఠానం కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు.

## అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



**(ఆత్మకూరు -- పవర్, సెప్టెంబర్ 29, 2026)** పరకాల నియోజకవర్గంలోని ఆత్మకూరు మండలంలో అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబాలను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి పరామర్శించారు. ఆత్మకూరు మండలంలోని కాంగ్రెస్ కార్యకర్తల కుటుంబాలను మరియు నిరుపేద కుటుంబాలను పరామర్శించి, వారి కష్టసుఖాలలో పాలుపంచుకుంటూ అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. మండలంలోని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తానట్నక ఉండి చూసుకుంటానని బాధిత కుటుంబాలకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు, సర్పంచులు, వార్డు సభ్యులు, సమన్వయ కమిటీ సభ్యులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## కేటీఆర్‌ను కలిసిన పెద్ది స్వప్న

**నర్సంపేట నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై చర్చ**



**( నర్సంపేట - పవర్, సెప్టెంబర్ 29 ) :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను నర్సంపేట మాజీ ఎమ్మెల్యే దివంగత పెద్ది సుదర్శన్‌రెడ్డి సతీమణి, మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న సుదర్శన్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. సుదర్శన్‌రెడ్డి మృతిచెందిన అనంతరం తొలిసారిగా కేటీఆర్‌ను కలిసిన ఆమె కుటుంబ పరిస్థితులను వివరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ కుటుంబ యోగక్షేమాలు, పిల్లల చదువుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం నర్సంపేట నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై చర్చ జరిగినట్లు సమాచారం. నియోజకవర్గంలోని ముఖ్య నాయకులతో త్వరలో సమావేశం ఏర్పాటు చేసి పరిస్థితులపై సమీక్ష నిర్వహిస్తానని కేటీఆర్ స్వప్నకు తెలిపినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

# గ్రామాల్లోని అన్ని షాపుల వ్యాపారులు ఎమ్మార్పీ ధరలకే అమ్మాలి..

### నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకొని సీజ్ మరియు భారీ ఫైన్



(హనుమకొండ -- పవర్, సెప్టెంబర్ 29)

పల్లెలు మరియు గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని రకాల వ్యాపార దుకాణాలు, కిరాణా షాపులు, జనరల్ స్టోర్స్ మరియు ఇతర ఏ సరుకులైనా సరే కచ్చితంగా ఎమ్మార్పీ (వీక్రా) ధరలకే విక్రయించాలని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అదనపు ధరలు వసూలు చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరిస్తున్నాం.

గ్రామాల్లోని చాలా చోట్ల వ్యాపారులు వినియోగదారుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని, నిర్ణీత ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువగా వసూలు చేస్తూ ప్రజలను దోచుకుంటున్నారనే ఫిర్యాదులు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని షాపులపై అధికారులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఇప్పటికే చాలా మంది దుకాణదారులు ఎమ్మార్పీ రేటుకి అమ్మకుండా ప్రజల దగ్గర దోచుకుంటూ ఉంటే ఇక సహించేది లేదని హెచ్చరిస్తున్నాం.దోపిడీ లేని గ్రామీణ సమాజమే మా లక్ష్యం: గ్రామీణ ప్రాంత ప్రజలను వ్యాపారుల అక్రమ సంపాదనకు బలికాకుండా కాపాడటమే మా ప్రధాన ధ్యేయం. ప్రతి పల్లెలోనూ వ్యాపారాల్లో పారదర్శకత తీసుకువస్తూ, వినియోగదారుల హక్కులను కాపాడేలా అక్రమార్కులపై నిరంతరం పోరాటం కొనసాగిస్తాం.అన్ని షాపులపై ఉక్కుపాదం: చిన్న కిరాణా కొట్ల నుంచి పెద్ద జనరల్ స్టోర్ల వరకు ప్రతి ఒక్క దుకాణంలోనూ విక్రయించే వస్తువులపై ముద్రించిన ఎమ్మార్పీ ధరలకే అమ్మకాలు జరపాలి.ఆకస్మిక తనిఖీలు: నిబంధనలను ఉల్లంఘించి ఎమ్మార్పీ కంటే ఒక్క రూపాయి ఎక్కువ తీసుకున్నా, లేదా రేట్లు ప్రదర్శించకపోయినా తనిఖీలు నిర్వహించి షాపుల లైసెన్సులు రద్దు చేయడంతో పాటు చట్టపరమైన కఠిన చర్యలు తీసుకొని దుకాణాలను సీజ్ చేసి భారీ జరిమానాలు విధిస్తారు.

ప్రజల భాగస్వామ్యం: ఎక్కడైనా వ్యాపారులు ఎమ్మార్పీకి మించి అమ్ముతుంటే వినియోగదారులు వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. గ్రామాల్లోని వ్యాపారులు అందరూ దళారీ విధానాలు మాని, ప్రభుత్వ నిబంధనలను తూచా తప్పకుండా పాటించి ఎమ్మార్పీ ధరలకే వస్తువులను విక్రయించాలని కోరుతున్నాను.

మీ గ్రామాల్లో ఏదైనా షాపులో ఎమ్మార్పీ కంటే ఎక్కువ అమ్ముతున్నారు అని మీకు సమాచారం ఉంటే వెంటనే ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులకు ఫిర్యాదు చేయండి. ఒకవేళ అధికారులు మీ సమస్యపై తగిన చర్యలు తీసుకోకపోతే, ఆ దుకాణం వివరాలు, షాప్ పేరు, యజమాని వివరాలను 8520861565 నంబర్‌కు వాట్సాప్ చేయండి. మీ సమస్యను వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కారమయ్యేలా కృషి చేస్తాను.

**-- ఇర్సడ్ల వంశీకృష్ణ, పవర్ దినపత్రిక, డిస్ట్రిక్ట్ స్టాఫ్ ప్రతినిధి**

# మహిళా పారిశ్రామికవేత్తలకు నైపుణ్యం, బ్రాండింగ్

### మార్కెటింగ్‌లో ప్రోత్సాహం వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు

### పప్పు మిల్లు ఆధునీకరణ, ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుపై సమీక్ష ..జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద




(వరంగల్ - పవర్,సెప్టెంబర్ 29):

జిల్లా కలెక్టరేట్ లో మంగళవారంవర్ధన్నపేట నియోజక వర్గ అభివృద్ధి పై వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గార్లు వీ హబ్ సంస్థ డైరెక్టర్ ఊహ, వారి బృందంతో కలిసి సంబధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమీక్ష లో మహిళా పారిశ్రామికవేత్తలు, స్వయం సహాయక సంఘాల మహిళలకు నైపుణ్య శిక్షణ అందించడంతో పాటు వారు తయారు చేసే ఉత్పత్తులకు మెరుగైన బ్రాండింగ్, మార్కెటింగ్ అవకాశాలు కల్పించేందుకు అవసరమైన చర్యల పై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో మహిళల ఆధ్వర్యంలో కొనసాగుతున్న జీవనోపాధి, ఉత్పత్తుల తయారీ కార్యక్రమాలను మరింత బలోపేతం చేయడం, ఆధునిక నైపుణ్య శిక్షణ, ఉత్పత్తుల నాణ్యత పెంపు, బ్రాండింగ్, మార్కెటింగ్‌కు అవసరమైన సదుపాయాల కల్పనపై చర్చించారు.గ్రామీణ ప్రాంత మహిళలకు స్థానిక వనరుల ఆధారంగా ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు వీ హబ్ ద్వారా అవసరమైన సహకారం అందించాలని ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు సూచించారు. మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ కల్పించేలా అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు.మహిళల ఆర్థిక స్వావలంబనకు దోహదపడేలా నైపుణ్య శిక్షణతో పాటు ఉత్పత్తులకు బ్రాండింగ్, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. అనంతరం వీ హబ్ బృందం పర్వతగిరి మండలంలోని పప్పు మిల్లు ఆధునీకరణకు సంబంధించిన ప్రతిపాదనలను, అలాగే వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలో ఏర్పాటు చేయనున్న ట్రైనింగ్ సెంటర్‌కు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించాలని సంబధిత అధికారులను సూచించారు.ఈ కార్యక్రమంలో డీఆర్డీవో నాగ పద్మజ, వరంగల్ ఆర్డీవో సుమ ,వర్ధన్నపేట తహసిల్దార్ విజయ్ సాగర్, వీ హబ్ డైరెక్టర్ ఊహ వారి బృంద సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గుండె వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

### రోహిణి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ కే. బుచ్చిరెడ్డి

(హనుమకొండ - పవర్,సెప్టెంబర్ 29):

గుండె వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని రోహిణి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ కే. బుచ్చిరెడ్డి తెలిపారు. మంగళవారం వరల్డ్ హార్ట్ డే సందర్భంగా రోహిణి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లో నిర్వహించిన వరల్డ్ హెల్త్ డే ను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆస్పటల్ చైర్మన్ బుచ్చిరెడ్డి మాట్లాడుతూ గుండె సంబంధిత నొప్పి వచ్చినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండడంతో పాటు శారీరక వ్యాయామాన్ని దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజలు తమ జీవనశైలిలో ఆరోగ్యకరమైన మార్పులు చేసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ వాకింగ్, వ్యాయామం, యోగా వంటి కార్యకలాపాలను తప్పనిసరిగా అలవాటుగా చేసుకోవాలని తెలిపారు. గుండెకు సంబంధించిన నొప్పి వచ్చినప్పుడు నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. కోవిడ్ అనంతరం వయస్సుతో సంబంధం లేకుండా వస్తున్న గుండె సంబంధిత వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వైద్యుల సలహా మేరకు ప్రతి మూడు లేదా ఆరు నెలలకు ఒకసారి గుండెకు సంబంధించిన ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, పరీక్షల ఫలితాల ఆధారంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని

సూచించారు. ఈ కార్యక్రమంలో రోహిణి హాస్పిటల్ సూపర్డెంట్ డాక్టర్ జె సుధాకర్ రెడ్డి, కార్డియాకేర్ డిపార్ట్మెంట్ ఇన్చార్జి డాక్టర్ విని, కార్డియాలజిస్ట్ డాక్టర్ మమతారెడ్డి, అడ్మిస్టేటివ్ డాక్టర్ బోస్, రోహిణి కాలేజీ ప్రిన్సిపల్ చింతు ప్రశాంతి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీమణి, హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది, పేషెంట్లు, తదితరులు పాల్గొన్నారు.



# గడ్డి మందుపై వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పోరాటానికి ఫలితం

### పారాక్వాట్ డైక్లోరైడ్ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేస్తూ కేంద్రం నిర్ణయం



(హనుమకొండ -- పవర్, సెప్టెంబర్ 28)

రైతులు మరియు గ్రామీణ ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన పారాక్వాట్ డైక్లోరైడ్ (గడ్డి మందు)పై వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య లోక్‌సభ వేదికగా చేసిన పోరాటానికి కీలక ఫలితం లభించింది. పారాక్వాట్ వినియోగం వల్ల జరుగుతున్న ప్రమాదాలను వివరిస్తూ దేశవ్యాప్తంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఎంపీ కావ్య మార్చి 27న లోక్‌సభ జీరో అవర్‌లో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లోక్‌సభలో ఆమె గళమెత్తిన ఎనిమిది నెలల వ్యవధిలోనే కేంద్ర ప్రభుత్వం కీలక పరిణామం చోటుచేసుకుంది.తాజాగా కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ సెప్టెంబర్ 22న జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో పారాక్వాట్ డైక్లోరైడ్‌కు కొత్తగా రిజిస్ట్రేషన్ ఇవ్వడాన్ని నిషేధించడంతోపాటు, ఇప్పటికే ఉన్న రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను రద్దు చేసినట్లు ప్రకటించింది. రిజిస్ట్రేషన్ కమిటీ ఆ సర్టిఫికెట్లను వెనక్కి తీసుకోవాలని, వాటిని తిరిగి ఇవ్వని వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కేంద్రం ఆదేశించింది.ఈ అంశాన్ని రాష్ట్రానికి పరిమితం చేయకుండా పార్లమెంట్‌లో జాతీయ సమస్యగా మార్చిన ఎంపీ కడియం కావ్య, పారాక్వాట్ వల్ల మానవ ఆరోగ్యం, పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోందని సభ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆత్మహత్యలకు ఈ రసాయనం సాధనంగా మారుతోందని, దీనికి నిర్దిష్ట విరుగుడు లేకపోవడం వల్ల ప్రాణనష్టం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంపీ డిమాండ్ నేపథ్యంలో తెలంగాణ శాసనసభ సంపూర్ణ నిషేధం కోరుతూ తీర్మానం చేయగా, రాష్ట్ర ప్రభుత్వం కూడా తాత్కాలిక నిషేధం విధించింది.కేంద్రం తాజా తుది ఉత్తర్వులు జారీ చేయడంపై వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య హర్షం వ్యక్తం చేస్తూ కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రమాదకర రసాయనాల బారిన పడకుండా రైతులకు సురక్షితమైన ప్రత్యామ్నాయాలను అందుబాటులోకి తీసుకురావాలని, నిషేధ ఉత్తర్వుల అమలును పకడ్బందీగా పర్యవేక్షించాలని ఆమె కోరారు.

# ఓటు హక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలి

### పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



(హనుమకొండ -- పవర్, సెప్టెంబర్ 28)

దేశ ప్రజాస్వామ్యానికి పునాది అయిన ఓటు హక్కును పరిరక్షించాల్సిన ఎన్నికల సంఘం పనితీరుపై తీవ్రమైన అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ఓటర్ల జాబితాలో అక్రమ మార్పులు మరియు తొలగింపులపై సమగ్ర విచారణ జరిపించాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి డిమాండ్ చేశారు. ఓటు చోరీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా చేస్తున్న పోరాటానికి మద్దతుగా ఏఐసీసీ ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు.హనుమకొండ ఆర్ట్స్ కాలేజీ ఆడిటోరియం నుంచి కాంగ్రెస్ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి తదితరులు నిరసన తెలిపారు. కలెక్టరేట్ ఎదుట కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ, రాజ్యాంగం కల్పించిన పవిత్రమైన ఓటు హక్కును కాలరాసే కుట్రలను ప్రజలంతా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఈ పోరాటంలో ప్రతీ కార్యకర్త సైనికుడిలా భాగస్వామ్యం కావాలని కోరారు. ఎన్నికల వ్యవస్థను భ్రష్టుపట్టిస్తున్న కేంద్ర తీరుపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో , టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్ గౌడ్, దుద్దిళ్ల శ్రీను బాబు, ఇ.వి. శ్రీనివాస్ రావు, టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ ,కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, డీసీసీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# Caste Discrimination Against AICC President Mallikarjun Kharge Is Highly Condemnable: Dr. Perumandla Ramakrishna

**Dr. Perumandla Ramakrishna Warns of Intensifying the Struggle for Self-Respect Against Caste Discrimination and Suppression**



**New Delhi – September 29:**

A massive Self-Respect Meeting was held today at the Constitution Club in New Delhi under the leadership of Mallu Ravi, Convener of the Congress MPs Forum. The meeting was attended by Deputy Chief Minister Bhatti Vikramarka, AICC General Secretary Mukul Wasnik, Ministers Muniyappa, Vivek and Seethakka, AICC leaders Koppula Raju and Rajendra Paul, ST Chairperson Biriya, and other senior leaders as chief guests.Senior Congress leader Dr. Perumandla Ramakrishna attended the programme and strongly condemned the alleged caste-discriminatory incident involving AICC President Mallikarjun Kharge.Dr. Ramakrishna stated that subjecting a prominent Dalit leader like Mallikarjun Kharge to discriminatory treatment is highly condemnable. He said that such inhuman and discriminatory practices cannot be tolerated under any circumstances.He further stated that the struggle for self-respect and against caste discrimination would be intensified at the national level until strict legal action is taken against those responsible and appropriate action is initiated against those found accountable. He emphasized that the Congress Party has always stood for the protection of the dignity, rights and self-respect of marginalized communities.Later, Dr. Ramakrishna expressed his views on national political developments, strategies to be adopted in support of Dalits in Uttarakhand, and future course of action.During the meeting, AICC General Secretary Mukul Wasnik specially appreciated the services and contributions of Dr. Perumandla Ramakrishna as a senior Congress leader.MLAs, MPs, Yadadri Board Member Dr. Lakshminarayana Naik, Sudhakar Goud, Suryakiran, Rajender, and several other leaders participated in the programme.

---

# హన్మకొండ బస్ స్టేషన్‌లో మొబైల్ ఫోన్ దొంగతనం కేసులో నిందితుడి అరెస్ట్ - సెల్‌ఫోన్ స్వాధీనం

**(హన్మకొండ - పవర్,సెప్టెంబర్ 29) :**

హనుమకొండ బస్ స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీని ఆసరాగా చేసుకుని మొబైల్ ఫోన్ దొంగతనానికి పాల్పడుతున్న ఒక యువకుడిని హనుమకొండ పోలీసులు అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుండి దొంగిలించబడిన మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల వివరాల ప్రకారం, మాదిగ అరవింద్, తా/శీ సుంకయ్య, వయస్సు 18 సంవత్సరాలు, నివాసం కీసర, మేడ్చల్ జిల్లా, గతంలో కూడా రద్దీగా ఉండే బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల వద్ద మొబైల్ ఫోన్లు, నగదు దొంగిలించినట్లు విచారణలో వెల్లడైంది. దొంగిలించిన మొబైల్ ఫోన్లను తక్కువ ధరకు విక్రయించి వచ్చిన డబ్బును వ్యక్తిగత ఖర్చులకు వినియోగించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు తెలిపారు.ఇదే క్రమంలో 28-09-2026 తెల్లవారుజామున హైదరాబాద్ నుండి బస్సులో బయలుదేరి సుమారు ఉదయం 07:30 గంటలకు హనుమకొండ బస్ స్టేషన్‌కు చేరుకున్నాడు. బస్ ఎక్కుతున్న ప్రయాణికులను గమనిస్తూ ఉండగా, సుమారు ఉదయం 08:00 గంటల సమయంలో ఒక ప్రయాణికుడి ప్యాంట్ జేబులో ఉన్న మొబైల్ ఫోన్‌ను అతనికి తెలియకుండా దొంగిలించినట్లు విచారణలో వెల్లడైంది.మరుసటి రోజు 29-09-2026 న తిరిగి హనుమకొండ బస్ స్టేషన్‌కు వచ్చి ప్రయాణికుల వద్ద మొబైల్ ఫోన్లు లేదా నగదు దొంగిలించేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో పోలీసులు అతని కదలికలను గమనించారు. పోలీసులను చూసి అక్కడి నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించగా పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు.నిందితునిపై గతంలో ఉప్పల్, నల్గొండ 2 టౌన్, చేవెళ్ల, ఆర్ పి ఎస్ వరంగల్,



సికింద్రాబాద్ లలో ఆరు కేసులు కలవు.బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు వంటి రద్దీ ప్రాంతాల్లో ప్రయాణించే సమయంలో ప్రజలు తమ మొబైల్ ఫోన్లు, నగదు మరియు ఇతర విలువైన వస్తువుల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. అనుమానాస్పద వ్యక్తులు లేదా కదలికలు కనిపించినట్లయితే వెంటనే సమీపంలోని పోలీసులకు సమాచారం అందించాలి అని కోరారు

# అమ్మమ్మ, నానమ్మ తాతయ్యలను గౌరవించాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**

**(హనుమకొండ - పవర్,సెప్టెంబర్ 29):**

హనుమకొండ న్యూశాయంపేట(పోచంపల్లి) లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అమ్మమ్మ తాతయ్య, నానమ్మ తాతయ్య, మనవలు, మనవరాలు మధ్య ఆత్మీయానురాగాలు, ప్రేమ పెంపొందించటంపై ప్రత్యేక కార్యక్రమంలి అమ్మమ్మ, నానమ్మలు, తాతయ్యలను ఎల్లప్పుడూ గౌరవించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. అక్టోబర్ 1అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వయో వృద్ధుల వారోత్సవాలలో భాగంగా అమ్మమ్మ తాతయ్య, నానమ్మ తాతయ్య, మనవలు, మనవరాలు మధ్య ఆత్మీయానురాగాలు, ప్రేమ పెంపొందించటంపై జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం హనుమకొండ న్యూశాయంపేట(పోచంపల్లి) లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ కు అంగన్వాడీ కేంద్రం చిన్నారులు, పాఠశాల విద్యార్థులు, తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పాఠశాల చిన్నారులు కళ్లకు గంతలు కట్టుకుని తమ అమ్మమ్మ, నాన్నమ్మ, తాతయ్యలు గుర్తించారు. అదేవిధంగా బెలూన్ లతో హత్తుకుని కొద్దిదూరం నడిచారు. అమ్మమ్మ, నాన్నమ్మలు, తాతయ్యలతో వారికి ఉన్న అనుబంధం గురించి పాఠశాల విద్యార్థులు చాలా చక్కగా వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారులు, విద్యార్థులు తమ అమ్మమ్మ నాన్నమ్మలు తాతయ్యలతో ఎంతో అనుబంధం ఉంటుందని పేర్కొన్నారు. ఆ అనుబంధం చిరస్థాయిగా కొనసాగాలన్నారు. అమ్మమ్మలు, నాన్నమ్మలు, తాతయ్యల ప్రేమను ఎల్లపుడు పొందాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి వచ్చిన తల్లిదండ్రులతో అమ్మమ్మ, నాన్నమ్మలు, తాతయ్యలతో



చిన్నారులు ప్రేమానుబంధం కొనసాగించాలని సూచించారు. వయో వృద్ధులను గౌరవించాలని తెలియజేశారు. జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ మాట్లాడుతూ వయోవృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని వయోవృద్ధుల వారోత్సవాలను వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అమ్మమ్మ, నాన్నమ్మలు తాతయ్యలతో ప్రేమగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. అదేవిధంగా చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణీలకు సీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పాఠశాల విద్యా శాఖ అధికారి ఎల్. వి. గిరిరాజ్ గౌడ్, ఎంఈవో మనోజ్ కుమార్, జీసీడీవో సునీత, ఏసీడీపీవో సింధూరాణి, హెచ్‌ఎం ఉప్పలయ్య, ఎన్జీవో అధ్యక్షురాలు అనితా రెడ్డి, వయో వృద్ధులసంక్షేమ సంఘం అధ్యక్షులు చంద్రమౌళి, దేవాచారి, దామోదర్, తేరాల యుగంధర్, ఎఫ్ఆర్వో రవికృష్ణ, డీఎంసీ కళ్యాణి, డీసీ సుమలత, అంగన్వాడీ సూపర్వైజర్లు, టీచర్లు, స్థానికులు పాల్గొన్నారు.



# రాఘవేంద్ర ఫర్టిలైజర్స్ వారి తల్లి మృతి పట్ల సంతాపం తెలిపి, కుటుంబ సభ్యులను పరామర్శించిన నాగుర్ల వెంకటేశ్వర్లు

**(పరకాల -- పవర్, సెప్టెంబర్ 29, 2026)**

హన్మకొండ జిల్లా పరకాల పట్టణానికి చెందిన రాఘవేంద్ర ఫర్టిలైజర్స్ వారి తల్లి గందే జగత్ లక్ష్మి (70) అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు వారి ఇంటికి వెళ్లి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.  ?అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతురాలి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థించారు.  ఈ కార్యక్రమంలో పరకాల మార్కెట్ మాజీ చైర్మన్ బండి సారంగపాణి, పరకాల ఫర్టిలైజర్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ఎర్రం రామన్న, రాకేష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో బాధపడుతున్న కాంగ్రెస్ నాయకురాలు మానసను పరామర్శించిన నాయిని నీలిమా రాజేందర్ రెడ్డి



**(హన్మకొండ -- పవర్, సెప్టెంబర్ 29, 2026)**

వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 47వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ్మడి మధు సతీమణి, జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి, నాయకురాలు మానస ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొంది కోలుకుని ఇంటికి చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి సతీమణి నాయిని నీలిమా రాజేందర్ రెడ్డి నేరుగా మానస నివాసానికి వెళ్లి ఆమెను పరామర్శించారు.ఈ సందర్భంగా మానస ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆమె త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.






# రామాయణ్ పార్ట్-1కి టైటిల్ ఫిక్స్

- 'రైజ్ ఆఫ్ ఏ లెజెండ్'గా ఫస్ట్ లుక్ రిలీజ్
- దీపావళికి మూవీ రిలీజ్

బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌బీర్ కపూర్ ప్రధాన పాత్రలో నితీశ్ తివారీ తెరకెక్కిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'రామాయణ'. ఇందులో రణ్‌బీర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా, యశ్ రావణుడిగా కనిపించనున్నారు. రెండు భాగాలుగా రానున్న ఈ చిత్రంలోని తొలి భాగానికి 'రామాయణ: రైజ్ ఆఫ్ ఏ లెజెండ్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. రణ్‌బీర్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. భారీ విజువల్స్‌తో రూపొందిన పోస్టర్‌లో రాముడిగా రణ్‌బీర్, రావణుడిగా యశ్ పాత్రలను హైలైట్ చేశారు. తొలి భాగాన్ని ఈ దీపావళికి ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.




# మల్లెపూల జడ.. గోల్డ్ కలర్ శారీ

- చూపుతిప్పుకోనివ్వని ప్రియా ప్రకాశ్ వారియర్
- సంప్రదాయ చీరకట్టులో మెరిసిన 'వింక్' బ్యూటీ
- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫొటోలు

మల్లెపూలు పెట్టుకుని.. గోల్డ్ కలర్ శారీలో మెరిసిపోయింది నటి ప్రియా ప్రకాశ్ వారియర్. సంప్రదాయ చీరకట్టులో ఎంతో అందంగా కనిపిస్తూ దిగిన ఫొటోలను ఆమె తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఈ ఫొటోలు ప్రస్తుతం నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. గోల్డ్ కలర్ శారీకి తగినట్లుగా సంప్రదాయ ఆభరణాలు ధరించిన ప్రియా.. తలలో మల్లెపూలు పెట్టుకుని మరింత ఆకర్షణీయంగా కనిపించింది. సింపుల్ అండ్ ఎలిగెంట్ లుక్‌లో ఆమె ఇచ్చిన పోజులు అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. చీరలో ప్రియా అందం మరింత ఇనుమడించిందంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. సినిమాలతో పాటు సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉండే ప్రియా ప్రకాశ్ వారియర్ తరచూ తన ఫొటోషూట్‌లను అభిమానులతో పంచుకుంటుంది. వెస్ట్రన్, ట్రెడిషనల్ ఇలా విభిన్న లుక్స్‌లో కనిపిస్తూ తన ఫ్యాషన్ సెన్స్‌తో ఆకట్టుకుంటోంది. తాజాగా గోల్డ్ కలర్ శారీలో షేర్ చేసిన ఈ ఫొటోలు కూడా అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి.





# బ్లాక్ డ్రెస్‌లో ఫరియా అబ్దుల్లా

- స్టైలిష్ లుక్‌తో ఆకట్టుకుంటున్న హీరోయిన్
- బోల్డ్ అండ్ గ్లామరస్ లుక్‌లో మెరిసిన బ్యూటీ
- సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఫొటోలు



హీరోయిన్ ఫరియా అబ్దుల్లా తాజాగా బ్లాక్ డ్రెస్‌లో చేసిన ఫొటోషూట్‌తో సోషల్ మీడియాలో సందడి చేసింది. గ్లామరస్ లుక్‌లో కెమెరాకు పోజులిస్తూ దిగిన ఫొటోలను ఆమె తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేసింది. ఈ ఫొటోలు ప్రస్తుతం అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. బ్లాక్ కలర్ అవుట్‌ఫిట్‌లో ఫరియా స్టైలిష్‌గా కనిపించింది. తనదైన కాన్ఫిడెంట్ పోజులతో ఫొటోషూట్‌కు మరింత గ్లామర్‌ను జోడించింది. సింపుల్ హెయిర్‌స్టైల్, మేకప్‌తో లుక్‌ను బ్యాలెన్స్ చేస్తూ ఫరియా ఇచ్చిన పోజులు నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. సినిమాలతో పాటు సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉండే ఫరియా.. ఎప్పటికప్పుడు తన ఫొటోషూట్‌లను అభిమానులతో పంచుకుంటుంది. ట్రెడిషనల్, వెస్ట్రన్, గ్లామరస్ లుక్స్‌లో కనిపిస్తూ తన ప్రత్యేకమైన స్టైల్‌తో ఆకట్టుకుంటోంది. తాజాగా బ్లాక్ డ్రెస్‌లో షేర్ చేసిన ఫొటోలు కూడా నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. ఈ ఫొటోలను చూసిన అభిమానులు ఫరియా లుక్‌పై ప్రశంసలు కురిపిస్తున్నారు. 'బ్లాక్‌లో మరింత స్టైలిష్‌గా ఉన్నావు', 'లుక్ అదిరిపోయింది', 'సో గార్జియస్' అంటూ కామెంట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ఫరియా లేటెస్ట్ ఫొటోషూట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# ఈవెంట్‌లో స్పెషల్ అట్రాక్షన్

- వెంకటేశ్, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో సినిమా
- అక్టోబర్ 9న ప్రేక్షకుల ముందుకు

విక్టరీ వెంకటేశ్ హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఆదర్శకుటుంబం'. ఈ సినిమా అక్టోబర్ 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో చిత్రబృందం ప్రమోషన్ కార్యక్రమాలను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా ఆదివారం ప్రత్యేక ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 'నారాయణమ్మ' అంటూ సాగే తొలి పాటను చిత్రబృందం విడుదల చేసింది. పాట విడుదల వేడుకలో చిత్ర యూనిట్ సభ్యులు సందడి చేయగా, నటి నివేదా పేతురాజ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈవెంట్‌కు స్టైలిష్ లుక్‌లో హాజరైన నివేదా పేతురాజ్ తన అందంతో ఆకట్టుకుంది. కెమెరాల ముందు పోజులిస్తూ సందడి చేసింది. ఈ సందర్భంగా ఆమెకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. ఈవెంట్‌లో నివేదా లుక్‌పై అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. వెంకటేశ్, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో 'ఆదర్శ కుటుంబం'పై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. తాజాగా విడుదలైన 'నారాయణమ్మ' పాటకు కూడా మంచి స్పందన వస్తోంది. సినిమా విడుదలకు ముందే ప్రమోషన్ కార్యక్రమాలతో చిత్రబృందం సందడి చేస్తోంది.



# వైజాగ్ భామ.. అదిరే లుక్!

- సింపుల్ లుక్‌తో ఆకట్టుకున్న తెలుగమ్మాయి
- 'తత్వం'తో టాలీవుడ్ ఎంట్రీ
- అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు సినిమా

తెలుగమ్మాయి, వైజాగ్ భామ దష్వికా టాలీవుడ్‌లో హీరోయిన్‌గా అడుగుపెడుతోంది. 'తత్వం' సినిమాతో ఆమె కథానాయికగా పరిచయం కానుంది. అక్టోబర్ 2న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో చిత్రబృందం ప్రమోషన్ కార్యక్రమాలను ముమ్మరం చేసింది. ప్రమోషన్స్‌లో భాగంగా దష్వికా తాజాగా మీడియా ముందుకు వచ్చింది. ఈ సందర్భంగా ఆమె పంజాబీ డ్రెస్‌లో సింపుల్ లుక్‌లో కనిపించి ఆకట్టుకుంది. సంప్రదాయ టచ్ ఉన్న అవుట్‌ఫిట్‌లో ఎలాంటి హంగూ ఆర్భాటం లేకుండా సహజమైన లుక్‌లో ఆమె ఇచ్చిన పోజులు అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. సింపుల్ డ్రెస్సింగ్, మినిమల్ మేకప్‌తో దష్వికా తన లుక్‌ను పూర్తి చేసింది. కెమెరాల ముందు కాన్ఫిడెంట్‌గా పోజులిస్తూ సందడి చేసింది. సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఆమె మీడియాతో ముచ్చటిస్తూ 'తత్వం'పై ఆసక్తిని పెంచుతోంది. వైజాగ్‌కు చెందిన దష్వికా హీరోయిన్‌గా తొలి అడుగులు వేస్తుండటంతో ఈ సినిమాపై ఆమె అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. అక్టోబర్ 2న 'తత్వం' విడుదల కానుండటంతో ప్రమోషన్ కార్యక్రమాల్లో దష్వికా లుక్స్ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.